ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ 5 భూపాలపల్లి
శనివారం 9 నవంబరు 2024





11న కేంద్రమంత్రి బండి సంజయ్ పర్యటన

6

రామప్ప ఉప ఆలయం ధ్వంసం కేసులో నలుగురి రిమాండ్

వివరాలు 6వ పేజీలో..

- మంత్రి పొంగులేటి ప్రకటనతో ఆశావహుల్లో జోష్
- సంక్రాంతికి జీపీలకు ఏర్పాటు కానున్న కొత్త పాలకవర్గం
- ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారుపై ఉత్కంఠ
- అభిప్రాయ సేకరణ చేస్తున్న బీసీ కమిషన్
- మరోవైపు కులగణనపై అధికారుల ఇంటింటి సర్వే
- ఇప్పటికే సిద్ధమైన గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితా
- గత ఫిబ్రవరి నుంచి ప్రత్యేక అధికారుల పాలనలో పల్లెలు
- ఉమ్మడి జిల్లాలో 1,705 గ్రామ పంచాయతీలు.. 15,046 వార్డులు



పల్లెలకు ఎన్నికల కళ!

గ్రామ పంచాయతీల్లో మొదలైన సందడి

పల్లెల్లో సర్పంచ్ ఎన్నికల సందడి షురువైంది. సంక్రాంతి పండుగకు గ్రామ పంచాయతీలకు కొత్త సర్పంచులు వస్తారని ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన ప్రకటన ఆశావహుల్లో జోష్ నింపింది. ఇన్నాళ్లూ సర్పంచ్‌గా చేసిన వాళ్లు, కొత్తగా బరిలో దిగాలనుకున్న వాళ్లు స్థానిక సమరానికి సమాయత్తమవుతున్నారు. ఇప్పటి నుంచే 'అన్న.. అక్క... తమ్మీ.. చెల్లీ.. అవ్వ..' అంటూ పలకరింపులు ప్రారంభించారు. కులాల వారీగా, వర్గాల వారిగా సమీకరణాలు చేస్తున్నారు. ఆర్థిక, అంగ బలాలను సిద్ధం చేసుకుంటున్నారు. అయితే రిజర్వేషన్ల అంశమే ఆశావహుల్లో గుబులు రేపుతోంది. శనివారం నుంచి ప్రారంభమయ్యే సమగ్ర కుటుంబ సర్వేలో నమోదయ్యే కులాలతో పాటు ఇప్పటికే నియమింపబడ్డ బీసీ కమిషన్ సేకరించిన నివేదికను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోనుంది. దీంతో పంచాయతీల్లో రిజర్వేషన్లు మారనున్నాయి. ఇదిలా వుండగా, అధికారులు మాత్రం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లాల్లో ఓటరు జాబితాను సిద్ధం చేశారు. ఎన్నికలకు నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాగా, కాంగ్రెస్‌లో టికెట్ కోసం ఆశావహుల పోటీ ఎక్కువగానే ఉంటోంది. పదేళ్ల తర్వాత అధికారంలోకి రావడంతో సర్పంచ్‌గిరీపై ఎక్కువమంది కన్నేశారు. అదేస్థాయిలో ప్రతిపక్షా పార్టీ నేతలు కూడా సిద్ధమవుతున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

6



టెక్నోజియాన్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ ఎన్వీ చౌదరి



టెక్నోజియాన్ షురూ..

నిట్‌లో సందడిగా ప్రారంభమైన సాంకేతిక ఉత్సవం

- పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థులు
- నేటి నుంచి ఈవెంట్లు ప్రారంభం
- అందంగా ముస్తాబైన క్యాంపస్
- తలపించనున్న మినీ భారతం

విద్యార్థుల సరికొత్త ఆవిష్కరణలకు వేదికైన టెక్నోజియాన్‌కు వరంగల్ నిట్ కళాశాల ముస్తాబైంది. ఈ మేరకు శుక్రవారం టెక్నోజియాన్‌కు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-ఐఐసిటి విశిష్ట శాస్త్రవేత్త డాక్టర్ ఎన్వీ చౌదరి హాజరయ్యారు. ఈ సాంకేతిక పండుగలో 50 ఈవెంట్లను నిర్వహించనున్నారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందచేస్తారు. అయితే ఈ సారి వేడుకలను రెండు రోజులే జరుపుతారు. అలాగే సాయంత్రం వేళ ఏర్పాటు చేసే సాంస్కృతిక ప్రదర్శనలను రద్దు చేశారు.

- ఆంధ్రజ్యోతి, హనుమకొండ

7

మావోయిస్టుల ఆయుధ డంప్ లభ్యం

- తాడ్వాయి మండలం బందాల అభయారణ్యంలో గుర్తించిన పోలీసులు
- మూడు తుపాకులు, 165బుల్లెట్లు స్వాధీనం

6



ఆయుధ డంప్‌లో లభ్యమైన తుపాకులు

మావోయిస్టు కదలికలపై నిఘా పెంచాలి

- గంజాయి రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలి
- ములుగు ఎస్పీ శభరిష్



పోలీసు సిబ్బంది నైపుణ్యాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శభరిష్

వాజేడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సరిహద్దు అడవుల్లో మావోయిస్టుల కదలికలపై మరింత నిఘా పెంచాలని ములుగు ఎస్పీ శభరిష్ అన్నారు. శుక్రవారం మండలంలోని పేరూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని రిసెప్షన్‌లో గల రికార్డులను పరిశీలించారు. నమోదైన కేసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన సిబ్బంది కిట్ ఆర్టికల్స్, ఆయుధ సామాగ్రి, సిబ్బంది నైపుణ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పేరూరు సరిహద్దున చత్తీస్‌గఢ్ రాష్ట్రం ఉన్నందున మావోయిస్టుల కదలికలపై మరింత నిఘా పెంచి వారి కార్యకలపాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. సరిహద్దుల వెంబడి వచ్చే గంజాయి రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీసు ఉద్యోగం అనే బాధ్యతతో కూడుకున్నదని, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలన్నారు. అలాగే పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలని, కేసుల దర్యాప్తు నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఎస్సైకు సూచించారు. స్టేషన్‌లోని పరిసరాలను పరిశీలించి సిబ్బంది సమస్యల తెలుసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీడీసీఆర్‌బీ రాములు, సీఐ బండారి కుమార్, ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తదితరులు ఉన్నారు.

అక్రమ వ్యాపారాలను కట్టడి చేయాలి



జిల్లా కేంద్రంలో సీసీఎస్ ఠాణాను ప్రారంభిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

- భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే
- జిల్లా కేంద్రంలో సీసీఎస్ ఠాణా ప్రారంభోత్సం

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమ వ్యాపారాలను ఎప్పటికప్పుడు కట్టడి చేయాలని జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే సూచించారు. జిల్లా కేంద్రంలోని పైలట్‌కాలనీలో నూతనంగా సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఆర్థిక నేరాలు, దొంగతనాలు, ప్రభుత్వ నిషేధిత వ్యాపారాల నియంత్రణే లక్ష్యంగా పని చేయాలన్నారు. నేరగాళ్లు ఎప్పటికప్పుడు నేరం చేసే విధానాన్ని మార్చుతూ ప్రజలను ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో బాధితులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) బోనాల కిషన్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ వసంత కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, నగేష్, రత్నం సీసీఎస్ ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న వరంగల్ జిల్లా టాస్క్ మేనేజర్ రామకృష్ణ

ములుగు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు టాస్క్ శిక్షణ ద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా టాస్క్ మేనేజర్ ఎం.రామకృష్ణ అన్నారు. శుక్రవారం ములుగులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో టాస్క్ కన్వీనర్ ఎస్.కవిత అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన టాస్క్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ మెళకువలు వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. టాస్క్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు మూడేళ్లపాటు 40రకాల శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని అన్నారు. టాస్క్ ద్వారా నైపుణ్యాలతోపాటు బ్యాంకింగ్, రైల్వే ఉద్యోగాలకు కూడా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కొప్పుల మల్లేశం మాట్లాడుతూ ప్రస్తుతం టాస్క్ ద్వారా అనేకమంది విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించిన ఘనత టాస్క్‌కే దక్కుతుందని అన్నారు. టాస్క్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న విద్యార్థులకు మూడు సంవత్సరాలపాటు శిక్షణ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఈ సదస్సులో కళాశాల అధ్యాపకులు సీహెచ్.భాస్కర్, సోమన్న, నాగమణి, సరిత, శిరీష, రాధిక, అనిల్‌కుమార్, ఉదయశ్రీ, విజేత, శంకర్, జగదీశ్, తేజోలత, శ్రీను, మౌలానా, అనిత, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులను ఇబ్బందులు పెట్టొద్దు

సీసీఐ కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



చిట్యాల కాటన్ మిల్లులో పత్తిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

చిట్యాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీబాల మురుగన్, అంజనేయ కాటన్ మిల్లులలో సీసీఐ కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పత్తి తీసుకుని వచ్చిన వాహనాలలో తేమ శాతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పత్తి విక్రయాల్లో కౌలు రైతులకు ఇబ్బందులు కాకుండా రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సహకరించాలని ఆదేశించారు. రైతులు పత్తిని ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు ఎదురైతే రైతులు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో చిట్యాల ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ, జిల్లా మార్కెటింగ్ అధికారి కనకశేఖర్, తహసీల్దార్ హేమ, ఆకుల బాలచందర్, బట్టు భాస్కర్, తదితరులు ఉన్నారు.

రామప్పను సందర్శించిన

స్కాట్లాండ్ దేశస్థులు



క్రాఫోర్డ్‌కు శిల్పకళా సంపద గురించి వివరిస్తున్న గైడ్ వెంకటేష్

వెంకటాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంపేటలో గల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని శుక్రవారం స్కాట్లాండ్ దేశానికి చెందిన డాక్టర్ క్రాఫోర్డ్-అనురాధ దంపతులు సందర్శించారు. ముందుగా వారు రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ శిల్పకళా సంపదను వీక్షించి, ఆలయ చరిత్ర, విశిష్టతను గైడ్ వెంకటేష్ ద్వారా తెలుసుకుని ఆనందం వ్యక్తంచేశారు. అనంతరం సరస్సు వద్దకు చేరుకుని ప్రకృతి అందాలను తిలకించారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి...

కలెక్టర్ రాహుల్‌శర్మ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పకడ్బందీగా సమగ్ర ఇంటింటి సర్వేను నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారి, నియోజకవర్గ ప్రత్యేక, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, సూపర్వైజర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ సామాజిక సమగ్ర సర్వేపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే నిర్వహణకు నిర్దేశించిన ఫార్మాట్ ఫారాలను మండలాలకు సరఫరా చేసినట్లు తెలిపారు. శనివారం నుంచి జిల్లాలో సర్వే ప్రారంభమవుతుందని ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి సమగ్ర ఇంటింటి సమాచారం సేకరించాలన్నారు. ఉదయం 8 గంటల వరకు సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఎవరికీ మినహాయింపు లేదన్నారు. ఎన్యుమరేటర్లు సర్వే పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం జారీ చేసిన పత్రాలలో మాత్రమే వివరాలు నమోదు చేయాలని డూప్లికేట్ ఫారాలకు అనుమతి లేదన్నారు. ప్రతీ రోజు 20 ఇండ్లల్లో సర్వే చేయాలన్నారు. ఈకార్యక్రమంలో కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీవో నారాయణరావు, సీపీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

11న కేంద్ర మంత్రి బండి సంజయ్ పర్యటన

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఈనెల 11న భూపాలపల్లి జిల్లాలో పర్యటించనున్నారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధిలో భాగంగా అమలుచేస్తున్న సంపూర్ణ అభియన్ కార్యక్రమంపై కలెక్టరేట్‌లో అధికారులతో మంత్రి సమీక్షించనున్నారు. అనంతం మహాముత్తారం మండల కేంద్రాన్ని సందర్శించనున్నారు. వ్యవసాయ, ఉద్యానవన, స్త్రీ,శిశు సంక్షేమ, హెల్త్, డీఆర్డీవో శాఖలు ఏర్పాటుచేసే స్టాల్స్‌ను ఆయన పరిశీలించనున్నారు. అనంతరం కరీంనగర్‌కు పయనంకానున్నారు. బండి సంజయ్ జిల్లా పర్యనటకు రానున్న నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



దంతాలపల్లిలో మాట్లాడుతున్న రాంచంద్రునాయక్

దంతాలపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రైతును రాజుగా చేయడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన ధ్యేయమని ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. శుక్రవారం ఆయన దంతాలపల్లి మండలంలోని రామా నుజపురం, పెద్దముప్పారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో రైతులకు తీరని నష్టం వాటిల్లిందన్నారు. రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు సన్న ధాన్యం కోసం రూ.500 మద్దతు ధరతో పాటు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ తదితర సంక్షేమ పథకాలను ప్రజల కోసం తీసుకొచ్చారన్నారు. గత పదేళ్ల పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. త్వరలోనే నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు కానుం దన్నారు. ప్రతీ పేద వారికి ఇందిరమ్మ రాజ్యంలో లబ్ధిచేకూరాలని కాంగ్రెస్ పార్టీ ముందు చూపుతో వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాము, తహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీడీవో వివేక్ రాం, ఎంపీవో అప్సర్‌పాష, నాయకులు నవీన్‌రెడ్డి, పాన్నోటి బాలాజీ, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, శివుడి అనుగ్రహం ఉండాలని పూజలు నిర్వహించినట్లు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం తొర్రూరు మండలం వెల్లికట్టలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి, శివాలయం ఎదుట ప్రతిష్ఠించిన ధ్వజస్తంభ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం దాతలు ముందుకు వచ్చి నిర్మించడం అభినందనీయమన్నారు. ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు. తొలుత ఎమ్మెల్యేకు సంస్కృతి కోలాటం నృత్యాలతో కళాకారులు, ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సంచు సంతోష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ప్రతికంఠం దేవేందర్ రాజు, ఓబీసీ మండల అధ్యక్షుడు దీకొండ శ్రీనివాస్, వీరమనేనని రమేష్, రాధిక, సంపత్, యాకన్న, వార్డు సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకు ఎన్నికల కళ!

- గ్రామ పంచాయతీల్లో మొదలైన ఎన్నికల సందడి
- మంత్రి పొంగులేటి ప్రకటనతో ఆశావహుల్లో జోష్
- ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారుపై ఉత్కంఠ
- ఇప్పటికే సిద్ధమైన గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితా

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)



పల్లెల్లో స్థానిక సందడి మొదలైంది. ఎప్పుడు నోటిఫికేషన్ వచ్చినా పోటీలో ఉండేందుకు ఆశావహులు సన్నద్ధమవుతున్నారు. 'సంక్రాంతికి కొత్త సర్పంచుల పాలన' అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ చేసిన ప్రకటనతో పల్లె పోరుపై నజర్ వేస్తున్నారు. అయితే రిజర్వేషన్లే ఉత్కంఠ రేపుతున్నాయి. రిజర్వేషన్ల లెక్కలు తేల్చేందుకే ప్రభుత్వం బీసీ కమిషన్ నియమించగా, వారు వివిధ వర్గాల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ఈలోగా ప్రభుత్వం తాజాగా మొదలు పెట్టిన కులగణన కూడా రిజర్వేషన్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మంత్రి సంక్రాంతి ప్రకటన, రిజర్వేషన్ల లెక్కలు ఆశావాహులను సంకటంలో పడేస్తున్నాయి. అయితే ఇప్పటికే అధికారులు గ్రామపంచాయతీల వారిగా ఓటరు జాబితాను సిద్ధం చేయటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక్కసారిగా పల్లె రాజకీయాలు వేడెక్కుతున్నాయి.

సంక్రాంతి నాటికి..

ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీతో సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తికావటంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. ఎనమిదిన్నర నెలలుగా జీపీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంక్రాంతికి కొత్త సర్పంచుల ప్రకటన ఆశావాహులను పల్లెల్లో వాలేలా చేసింది. సాధ్యమైనంత త్వరగా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. సంక్రాంతిలోగా సర్పంచ్ ఎన్నికలు పూర్తి చేసి, ఆ తరువాత ఫిబ్రవరి మొదటి వారంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు కూడా నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉందనే వార్తలు వినబడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఓటరు జాబితాను సిద్ధం చేసిందనే చర్చ జరుగుతోంది.

కాంగ్రెస్‌లో జోష్

పదేళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. మొన్నటి వరకు మెజారిటీ గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు జడ్పీటీసీలు కూడా బీఆర్ఎస్‌కు చెందిన వారే కొనసాగారు. అక్కడక్కడా గెలిచిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల్లో అత్యధికులు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ప్రస్తుతం రాజకీయ వాతావరణం మారటంతో పాటు అధికారంలో ఉండటంతో కాంగ్రెస్ శ్రేణుల్లో సర్పంచ్ గిరిపై కన్నుపడింది. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా పోటీకి సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. జనగామ నియోజకవర్గంలో మినహా ఉమ్మడి వరంగల్ జిల్లాలో అందరూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉండటంతో గెలుపు సులువు అనే ధీమాతో కాంగ్రెస్ కేడర్ ఉంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అనేకం అమలు కావటం లేదని, వాటిని తమకు అనుకూలంగా మలుచుకుని పల్లెల్లో పాగా వేయాలనే వ్యూహంతో ప్రతిపక్ష పార్టీలు కూడా బలమైన లీడర్లను బరిలో దించేందుకు ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నారు.

రిజర్వేషన్ల టెన్షన్

సర్పంచ్ ఎన్నికలను గత ప్రభుత్వం ఖరారు చేసిన పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తారా? లేక కొత్త రిజర్వేషన్లను ప్రకటిస్తారా? అనే ఉత్కంఠ ఆశావహుల్లో నెలకొంది. పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తే.. ఇన్నాళ్లు ఎన్నికలు నిర్వహించకుండా ఎందుకు తాత్సారం చేసినట్లు అనే వ్యాఖ్యలు వినబడతాయి. పాత రిజర్వేషన్లు కులాల జనాభా ప్రకారం లేవని, తమ రిజర్వేషన్ల వాటా పెంచాలని వివిధ వర్గాలు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. పాత రిజర్వేషన్లే అయితే బీసీ కమిషన్ నియమించి, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై ఎందుకు అభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు అనే ప్రశ్నలు కూడా తెరపైకి వస్తున్నాయి. అంతేకాకుండా పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తే కులగణన ఎందుకు చేపట్టినట్లు అనే చర్చ జరుగుతోంది. ఒకవేళ కొత్త రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్లితే సంక్రాంతి లోపు బీసీ కమిషన్‌తో పాటు కుల గణన లెక్కలు తేలేనా? అనేది ఉత్కంఠగా మారింది. అయితే డిసెంబరు చివరిలోగా కొత్త రిజర్వేషన్ల ఖరారు చేసి, పంచాయతీలకు ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ ఇచ్చే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే ఇప్పటికే గ్రామాల ఓటరు జాబితాను ప్రభుత్వం సిద్ధం చేసిందనే చర్చ జరుగుతోంది. ఈ విషయమై అధికారులకు కూడా ప్రభుత్వం నుంచి ప్రాథమికంగా సమాచారం అందటం వల్లనే ఓటరు జాబితాను తయారు చేశారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

రెండు విడతల్లోనే..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు విడతల్లో సర్పంచ్ ఎన్నికలను నిర్వహించగా, ఈసారి రెండు విడతల్లో పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తుందనే ప్రచారం ఉంది. కాగా, కొత్త రిజర్వేషన్ల వస్తే ప్రస్తుతం ఉన్న జనరల్ సీట్లు లేదా రిజర్వేషన్లు సీట్లు కూడా మారే అవకాశం ఉంది. దీంతో ఆశావహుల్లో రిజర్వేషన్ల టెన్షన్ పట్టుకుంది. సర్పంచ్‌గిరిపై పదేళ్లకు పైగా గురిపెట్టిన గ్రామ స్థాయి నేతలకు కంటిమీద కునుకు లేకుండా చేయనుంది. కొత్త రిజర్వేషన్లతో తమ సీటుకు ఎక్కడ ఎసరు వస్తుందో అనే ఆందోళనతో పాటు కొత్త రిజర్వే షన్లతో తమకు కలిసి వస్తుందనే ఆశగా ఎదురు చూసే వారు కూడా లేకపోలేదు. మొత్తానికి సంక్రాంతికి కొత్త సర్పంచులంటూ ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన ప్రకటన పల్లె రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో గ్రామాలు, వార్డులు, ఓటరు వివరాలు

జిల్లా	మండలాలు	జీపీలు	వార్డులు	ఓటర్లు
వరంగల్	11	325	2,828	3,89,052
హనుమకొండ	12	210	1,986	3,65,832
జనగామ	12	283	2,576	4,09,797
మహబూబాబాద్	16	473	4,056	5,52,192
భూపాలపల్లి	11	240	2,044	2,90,663
ములుగు	09	174	1,556	2,37,858
మొత్తం	71	1,705	15,046	22,45,394

ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలి

- జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్
- పోలీస్‌స్టేషన్ పరిసరాలు, రికార్డుల తనిఖీ
- సిబ్బంది పనితీరు, సమస్యలపై ఆరా





గూడూరు పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, పోలీస్‌స్టేషన్‌లో వాలీబాల్ క్రీడాకారులతో ఎస్పీ

గూడూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పోలీసులు అందుబాటులో ఉండి సేవలందించాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అన్నారు. గూడూరు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులు, రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారెట్, టెక్నికల్ రూం, జీడీ ఎంట్రీ తదితర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వాలీబాల్, షటిల్, క్రికెట్ కోర్టులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని చెప్పారు. ప్రజా ఫిర్యాదుల్లో ఎటువంటి జాప్యం జరుగకుండ బాధితుల పట్ల తక్షణమే స్పందించాలన్నారు. ప్రజలకు ఎళ్లవేళల అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో బ్లూకోర్ట్స్, పెట్రోల్ కార్స్ సిబ్బంది విధుల పట్ల అశ్రద్ధ వహించవద్దన్నారు. 24 గంటలు పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. డయల్ 100కు కాల్ రాగానే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. వాహనదారుల్లో ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలన్నారు.

గూడూరు సీఐ, ఎస్సైలను అభినందించిన ఎస్పీ

గూడూరు పోలీస్‌స్టేషన్‌లో పచ్చదనం, రికార్డుల నిర్వహణ, పోలీస్‌స్టేషన్ ఆవరణ పరిశుభ్రంగా ఉండడంతో సీఐ బాబురావు, ఎస్సై గిరిధర్‌రెడ్డిల మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అభినందించారు. సుమారు రెండు గంటల పాటు పోలీస్‌స్టేషన్‌లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ విధంగానే రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు మెరుగైన అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడ ఎస్సై కుశకుమార్, గంగారం ఎస్సై రవికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మావోయిస్టుల ఆయుధ డంప్ లభ్యం

- తాడ్వాయి మండలం బందాల అభయారణ్యంలో గుర్తించిన పోలీసులు
- మూడు తుపాకులు, 165 బుల్లెట్లు స్వాధీనం

ములుగు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం బందాల అభయారణ్యంలో మావోయిస్టులు దాచిపెట్టిన అయుధ డంప్‌ను పోలీసులు శుక్రవారం గుర్తించారు. లభ్యమైన ఆయుధాలను జిల్లా పోలీసు కార్యాలయానికి తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్పీ శబరీశ్ మీడియాకు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు బాంబు డిస్పోజల్ బృందంతో కలిసి పోలీసులు ఒడ్డుగూడెం గ్రామ సమీపంలోని ఉదయం 11గంటల సమయంలో వట్టివాగు వద్ద తనిఖీలు జరిపారు. ఈక్రమంలో వారికి ఆయుధాలు దాచి ఉన్న డంప్ లభ్యమైంది. అందులో 7.62ఎంఎం ఎస్ఎల్ఆర్, బెల్జియం మోడల్ ఎస్ఎల్ఆర్, 30-60ఎంఎం స్ప్రింగ్‌ఫీల్డ్, 165బుల్లెట్లు, రెండు ఎస్ఎల్ఆర్ మ్యాగజైన్‌లు, నాలుగు మ్యాగజైన్ పౌచ్‌లు లభ్యమయ్యాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతే అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు పోలీసుల ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోవాలని, ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు డీఎస్పీ రవీందర్, పస్రా సీఐ రవీందర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ శబరీశ్ (ముందు తుపాకులు, బుల్లెట్లు)

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

- కాలేజీ మార్చడం లేదని మనస్తాపం
- నేడు మృతుడి బర్త్‌డే..
- గుడికి వెళ్లేందుకు కుటుంబ సభ్యుల ఏర్పాట్లు
- జనగామ జిల్లా చాగల్‌లో విషాదం



సాయికిరణ్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కాలేజీ మార్చాలని తల్లిదండ్రులను కోరగా, వారు ససేమిరా అనడంతో మనస్తాపం చెందిన విద్యార్థి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం... జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని ఛాగల్‌కు చెందిన పసునూరి వేణుగోపాల్-సుకన్య దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు పసునూరి సాయికిరణ్ (17) హన్మకొండలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. దీపావళి పండుగ పురస్కరించుకొని హాస్టల్ నుంచి ఇంటికి వచ్చాడు. తిరిగి వెళ్లేందకు సాయికిరణ్ విముఖత వ్యక్తం చేశాడు. తాను చదువుతున్న కాలేజీకి వెళ్లలేనని, మరో కాలేజీలో చేర్పించాలని తండ్రిని కోరాడు. దానికి తండ్రి నిరాకరించాడు. మరో ఐదు నెలల్లో కాలేజీ పూర్తి అవుతుందని, కొన్ని రోజులే కదా సర్దుబాటు కావాలని సూచించాడు. దాంతో మనస్తాపం చెందిన ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు

సాయికిరణ్ నేడు(శనివారం) బర్త్‌డే జరుపుకోనున్నాడు. కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా పాలకుర్తి మండలంలోని వల్మిడి రామాలయానికి కుటుంబంతో వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఇదే విషయాన్ని సాయికి కూడా వెల్లడించారు. బర్త్‌డే తర్వాత మళ్లీ అదే కాలేజీకి వెళ్లాల్సి వస్తుందని మనస్తాపం చెందిన సాయికిరణ్ ఇంట్లో ఎవరులేని సమయంలో శుక్రవారం ఉరివేసుకున్నాడు. పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన పేరెంట్స్ కుమారుడు ఆత్మహత్య చేసుకొని మృతి చెందడాన్ని చూసి భోరున విలపించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు.

డోర్నకల్ బైపాస్ లైన్‌లో పట్టాలు తప్పిన గూడ్స్

డోర్నకల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ రైల్వేస్టేషన్ సమీపంలో విజయవాడ-భద్రాచలం రోడ్ వైపు వెళ్లే బైపాస్ లైన్‌లో శుక్రవారం రాత్రి ఖాళీ వ్యాగన్‌లతో వెళ్తున్న గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఈ ఘటనలో ఇంజన్ వెనుక నుంచి మధ్యలో గల 17, 18, 19 గూడ్స్ వ్యాగన్‌లు పట్టాలు తప్పాయి. ఈ విషయం తెలుసుకున్న రైల్వే సిబ్బంది, అధికారులు ఘటన స్థలానికి చేరుకున్నారు. గూడ్స్ రైలు పట్టాలు తప్పిన తీరును పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మరమ్మతు పనులు చేపట్టారు. బైపాస్ లైన్‌లో గూడ్స్ పట్టాలు తప్పడంతో రైళ్ల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలుగలేదు.



డోర్నకల్ బైపాస్ లైన్ వద్ద పట్టాలు తప్పిన గూడ్స్ వ్యాగన్

రామప్ప ఉప ఆలయం ధ్వంసం కేసులో

నలుగురి రిమాండ్

పరారీలో ఉన్న ముగ్గురి కోసం పోలీసుల గాలింపు

ములుగు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేటలో గల ప్రపంచ ప్రఖ్యాత రామప్ప దేవాలయ ఉప ఆలయాలలో ప్రాధానమైన గొల్లాల గుడిని గుప్తనిధుల కోసం ధ్వంసం చేసిన కేసులో నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఈ ఏడాది సెప్టెంబరు 21న అర్థరాత్రి గుర్తు తెలియని దుండగులు రామప్ప ప్రధాన ఆలయం సమీపంలోని గొల్లాల గుడిలోకి చొరబడ్డారు. పైకప్పును ధ్వంసం చేయడమేకాక శివలింగాన్ని పెకిలించారు. పురావస్తు శాఖ అధికారి చెన్నబోయిన కుమారస్వామి మరుసటి రోజు గుర్తించి వెంకటాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తింపు పొందిన నేపథ్యంలో ఈ దుర్ఘటనను పురావస్తు, పోలీసు శాఖ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ టీఎస్. దివాకర గొల్లాల గుడిని సందర్శించి సమగ్ర దర్యాప్తుకు ఆదే శించారు. తక్షణమే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతోపాటు వాచ్‌మెన్‌లను నియమించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ములుగు ఎస్పీ శబరీశ్ పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం బయ్యారం గ్రామానికి చెందిన జాగిరి నరేష్, పులి గౌతమ్, నలుబోతుల ఎర్రయ్య, ఇదే జిల్లా గుర్రంపేటకు చెందిన రాయబాం ఆగయ్యలను ఈనెల 6న అరె స్టు చేసిన పోలీసులు శుక్రవారం ములుగు జిల్లా కోర్టులో హాజరుపర్చారు. గుప్త నిధుల తవ్వకాలలో మరో ముగ్గురి పాత్ర ఉన్నట్లు గుర్తించామని, వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని ములుగు డీఎస్పీ రవీందర్ తెలిపారు. దర్యాప్తు సమగ్రంగా జరుగుతోందని, ఎవరినీ వదిలిపెట్టమని స్పష్టం చేశారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్



కేసముద్రం మార్కెట్లో సీసీఐ కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ఈ కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. సీసీఐ ప్రమాణాలకు అనుగునంగా 8 నుంచి 12 శాతం తేమ, నాణ్యత గల పత్తిని తీసుకువస్తే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. పత్తి రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయిస్తే గిట్టుబాటు ధర లభించి ప్రయోజనం పొందుతారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు భరత్‌చంద రెడ్డి, మార్కెట్ చైర్మన్ గంట సంజీరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, బండారు దయాకర్, కదిరె సురేందర్, బండారు వెంకన్న, కమిటీ సభ్యులు చిదిరాల వసంతరావు, వోలం రమేష్, ప్రత్యేక హోదా కార్యదర్శి కోలా అమరలింగేశ్వర్‌రావు పాల్గొన్నారు. కాగా, ఈ ప్రారంభోత్సవం వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, రుణమాఫీ చేయడం లేదంటూ బహిరంగంగా ఆరోపణలు చేయడంతో పార్టీ శ్రేణులు, పోలీసులు ఆయన్ను సముదాయించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీ రకం)	2450	2080
పల్లికాయ (సూక)	5010	4000
పల్లికాయ (పచ్చిది)	---	---
కందులు	7712	6550
పెసళ్లు	6459	4052
పత్తి	6930	5500
కొత్తపత్తి	---	---
పసుపు (కాడి)	---	---
పసుపు (గోల)	---	---
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	17000	16500
వండర్‌హాట్ ఏసీ	14500	11000
యూఎస్341ఏసీ	13800	11000
దేశీ ఏసీ	---	---
సింగిల్‌పట్టి ఏసీ	---	---
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

రాములో.. రాములా..!

- ఆ ఊరిలో ఒకే పేరుతో సుమారు 200 మంది

• ఔరా..


జీడికల్‌లోని సీతారామచంద్ర స్వామి ఆలయం

అది జనగామ జిల్లా లింగాలఘణపురం మండలంలోని జీడికల్ గ్రామం. త్రేతాయుగం నుంచే శ్రీరామచంద్రస్వామి కొలువుదీరిన ఆలయం ఇక్కడే ఉండటంతో అందరూ ఆ శ్రీరామచంద్రుడుని తమ ఇలవేల్పుగా కొలుస్తారు. అంతేకాదు తమ సంతానానికి ఆ రామచంద్రుడి పేరు కలిసొచ్చేలా రాములు అని పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో ఈ గ్రామంలో ఇప్పటి వరకు సుమారు 200మందికి పైగా రాములు అనే పేరున్నవారు అంటే ఔరా అనక తప్పదు. ఇక ఒకే కుటుంబంలో ముగ్గురు అన్నదమ్ములు ఉంటే వాళ్ల పేర్లు పెద్ద రాములు.. నడిపి రాములు.. చిన్న రాములు.. అని పెట్టుకున్న వారున్నారు. ఇంకా తండ్రీకొడుకుల పేర్లు రాములు అని ఉన్నవారు కూడా ఉండగా.. వారిని తండ్రి రాములు, కొడుకు రాములుగా సంబోధిస్తారు. అంతేకాదు బండమీది రాములు, బస్టాండ్ కాడి రాములు, హోటల్ రాములు అంటూ వారు వృత్తులు, నివసించే ప్రాంతాలను జోడించి పిలుచుకుంటారు. ఇక పోస్టాఫీస్‌కు రాములు అనే పేరుతో ఏదైనా ఉత్తరం వస్తే ఎవరికి ఇవ్వాలో అర్థం కాక పోస్ట్‌మాస్టర్ పడే తిప్పలు అన్నీ ఇన్నీ కావు. అయితే ఇప్పటి ఫ్యాషన్ ప్రపంచంలో పిల్లలకు తల్లిదండ్రులు రాములు అనే పేరునే కాకుండా ర అక్షరం కలిసొచ్చేలా కొత్తకొత్త పేర్లను పెట్టుకుంటున్నారు. ఇక ఇదే మండలంలోని పటేల్‌గూడెం గ్రామంలోనూ ఇదే పరిస్థితి. కాకపోతే ఇక్కడ గోపాలస్వామి ఆలయం ఉండటంతో గ్రామస్థులు చాలామంది గోపాలస్వామిని ఇలవేల్పుగా కొలుస్తూ.. తమ సంతానం పేర్లను గోపాల్, గోపయ్య, గోపి, గోపాలస్వామిగా పెట్టుకోవడం గమనార్హం.

\- లింగాలఘణపురం

వేంకటేశుని సేవలో..

- శ్రీవారి సేవలపై ఓరుగల్లు మహిళల ఆసక్తి
- ఇటీవలి కాలంలో సుమారు 20వేల మంది తిరుమల పయనం
- ఉమ్మడి జిల్లాలో 510కి పైగా భజన మండళ్లు

హనుమకొండ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆ అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, ఏడుకొండల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ఎన్నో వ్యయ ప్రయాసలకోరుస్తారు. మూడు నెలల ముందుగా దర్శనం స్లాట్లు బుక్ చేసుకుని తిరుమలకు పయనమవుతారు. కానీ ఇటీవలి కాలంలో ఏకంగా వారం రోజుల పాటు తిరుమలలోనే ఉండి స్వామివారి సేవల్లో పాల్గొని తరిస్తున్నారు. ముఖ్యంగా ఈ సేవల్లో పాల్గొనేందుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. అలా నిత్యం తిరుమలలోని స్వామివారి సేవలో కనీసం 5వేల మంది సేవకులు పాల్గొంటుండగా.. వారిలో ఉమ్మడి వరంగల్ జిల్లా వారు కూడా ఉంటున్నారు. ఈ మధ్య కాలంలో ఉమ్మడి జిల్లా నుంచి సుమారు


శ్రీవారి సేవలో పాల్గొన్న హనుమకొండ మహిళల బృందం

20వేల మంది మహిళలు స్లాట్స్ బుక్ చేసుకొని సేవలో తరించి వచ్చినట్లు తెలుస్తోంది. వరంగల్, హనుమకొండ నగర ప్రాంతాలతో పాటు అనేక గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా మూడు నెలల ముందుగానే 15 నుంచి 20మంది భక్తులు శ్రీవారి సేవకు బయల్దేరి వెళ్తున్నారు. తాజాగా హనుమకొండ అడ్వొకేట్స్‌కాలనీ నుంచి బొల్లం సునిత ఆధ్వర్యంలో 15మంది మహిళలు స్వామివారి సేవలో పాల్గొని వచ్చారు. అలాగే బ్రాహ్మణవాడకు చెందిన మహిళలు, భీమారంకు చెందిన పరంకుశం శిరీషా గిరిధర్ కృష్ణ ఆధ్వర్యంలో కూడా 15మంది చొప్పున భక్తులు శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఇంకా అనేక మంది సేవలో పాల్గొనేందుకు ఉత్సాహం చూపుతూ స్లాట్లను బుక్ చేసుకుంటున్నారు.

స్వామి సేవ మహాభాగ్యం..

హనుమకొండ నుంచి ఇటీవల స్వామివారి సేవలో పాల్గొని వచ్చిన బొల్లం సునిత, జ్యోతిరాణి, చైతన్య, రాధిక, బిందురెడ్డి తదితరులు మాట్లాడుతూ వారం రోజుల పాటు స్వామివారి సేవలో తరించి రావడం మహాభాగ్యమన్నారు. తమకు అక్కడ ప్రత్యేక వసతి, భోజన సౌకర్యం కల్పించారని, ముఖ్యంగా చివరి రోజు నాలుగు గంటల పాటు స్వామివారి సన్నిధిలో ఏకాంత సేవలో, భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు తమకు అవకాశం కల్పించారన్నారు. తమ బృందంలో రెండు, మూడు సార్లు సేవలోపాల్గొని వచ్చిన భక్తులు కూడా ఉన్నారన్నారు. ఒకరోజు వకుళామాత మందిరం వద్ద , మరొక రోజు కొబ్బరికాయల విక్రయం వద్ద, మరో రోజు నిత్యాన్నదాన కార్యక్రమంలో భాగంగా కూరగాయలు తరగడం లాంటి అనేక సేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడం గొప్ప అనుభూతి కలిగించిందన్నారు. ఇలా ఇటీవలి కాలంలో అనేక మంది ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 100కు పైగా సేవా బృందాలు తిరుమలకు వెళ్లి వచ్చాయని చెబుతున్నారు.

భజన బృందాలు కూడా..

ఉమ్మడి జిల్లాలో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ద్వారా నమోదైన 510కి పైగా భజనబృందాల్లో నిత్యం ఏదో ఒక బృందం చొప్పున తిరుమలకు వెళ్లి స్వామివారి సేవలో పాల్గొంటున్నాయి. ఒక్క జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచే 250కి పైగా భజన బృందాలు ఉండగా మహబూబాబాద్ నుంచి 100, హనుమకొండ , వరంగల్ నుంచి 98, జనగామ జిల్లా నుంచి 90 దాకా బృందాలు స్వామివారి సేవలో ముఖ్యంగా అఖండ హరినామ సంకీర్తన, యక్షగానాలు తదితర కార్యక్రమాల్లో పాల్గొంటున్నాయి. ఇంకా టీటీడీ ద్వారా నమోదు కాని బృందాలు కూడా 400కు పైగా ఉన్నాయని ఒక అంచనా. వసతి, భోజన సౌకర్యాలతో పాటు స్వామివారి ప్రత్యేక దర్శనాన్ని కల్పిస్తున్న క్రమంలో భజన బృందాలు ఉత్సాహంగా స్వామివారి సేవకు తరలి వెళ్తుండడం విశేషం.

• ఆధ్యాత్మికం


శ్రీవారి భజనలో పాల్గొన్న పత్తిపాక బృందం

ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు..

తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ద్వారా ఉమ్మడి జిల్లాలో ఏటా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యక్రమ నిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ముఖ్యంగా మనగుడి పేరిట ఎంపిక చేసిన ఉమ్మడి జిల్లాలోని ఒక్కో ప్రాంతంలో అన్ని పర్వదినాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గీతా జయంతి, గో పూజలు, రథ సప్తమి వేళ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహింప చేస్తున్నామన్నారు. వీటితో పాటు స్వామివారి సేవలో పాల్గొనే భజన బృందాలను సమన్వయపర్చి ప్రతీ రోజు ఉమ్మడి జిల్లా నుంచి ఒక బృందం తిరుమలలో ఉండేలా కార్యక్రమాలు రూపొందించామన్నారు. 2016 నుంచి తిరుమలలో ప్రారంభమైన శ్రీవారి సేవలో భక్తులు కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ముఖ్యంగా మహిళలు బృందంగా తయారై వెళ్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు వరంగల్ నగరంతోపాటు మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు, జనగామ, తదితర ప్రాంతాల నుంచి 25వేలకు పైగా శ్రీవారి సేవకులు పేర్లు నమోదు చేసుకొని సేవకు వెళ్లి వచ్చినట్లు ఆయన వెల్లడించారు.


ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన దృశ్యం


ఆలయంలోని శివలింగం

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

- పంచలింగాల శివాలయానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- దర్శించుకున్న పలువురు ప్రముఖులు

ఆత్మకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో పునఃనిర్మితమైన పంచలింగాల శివాలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలను వేద మంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. హైదరాబాద్ వేద పండితుల చేతుల మీదుగా గణపతి హోమం, రుద్రహోమం నిర్వహించిన అనంతరం గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన, నైరుతి లింగం, వాయు లింగం, దక్షిణ ముఖ లింగం, ఆగ్నేయ లింగం, ఈశాన్య లింగ ప్రతిష్ఠాపన వేద పండితులు వేద మంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, మేళ తాళాలతో నిర్వహించారు. వేద పండితుల సమక్షంలో ఈశాన్య లింగాన్ని రాష్ట్ర ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీత పర్వతగిరి రాజు దంపతులు ప్రతిష్ఠాపన చేశారు.

పార్వతిమాత ప్రతిష్ఠాపన, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నవగ్రహ ప్రతిష్ఠాపన, జంట నాగుల ప్రతిష్ఠాపనతో పాటు కుంభాభిషేకం, కలశ ఆరాధనను భక్తుల శివనామస్మరణ నడుమ వైభవంగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలిరావడంతో సీఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తును, రోప్‌పార్టీ పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టారు. ఈ వేడుకల్లో మాజీ మేయర్ డాక్టర్ రాజేశ్వర్‌రావు, రాజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు వగాల సమ్మిరెడ్డితో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

దర్శించుకున్న నేతలు

దక్షిణ ముఖ పంచలింగాల శివాలయంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, పరకాల కోర్టు జడ్జి శాలిని లింగం దర్శించుకొని విశేష పూజలను నిర్వహించారు. బీజేపీ


శివాలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ విజయచందర్‌రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ ఫెడరేషన్ చైర్మన్ కడారి నవనీతరావు, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ ప్రధాన కార్యదర్శి చిదిరాల సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా మైనారిటీ సెల్ నాయకులు మహ్మద్ బాబుమియాలు విశేష పూజలు నిర్వహించారు.

స్కాన్ చెయ్.. సమాచారం పట్టు..

- గూగుల్ మ్యాప్ ద్వారా కాకతీయుల చరిత్ర సందర్శన
- ఆధునిక పద్ధతిలో పర్యాటకులను అలరిస్తున్న కాకతీయుల చరిత్ర

ఖిలావరంగల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చారిత్రక ప్రసిద్ధి గాంచిన ఖిలావరంగల్ కోటను ఆధునిక పద్ధతిలో పర్యాటకులు తిలకించేందుకు భారతీయ సర్వేక్షణ, కేంద్ర పురావస్తు శాఖ సెల్ ఫోన్‌లో స్కాన్ ద్వారా గూగుల్‌ను ఏర్పాటు చేసింది. దేశ విదేశాలలో పేరెన్నిక గల కాకతీయుల కాలం నాటి ఖిలావరంగల్ మధ్యకోటలోని శిల్పాల ఆవరణలోని చారిత్రక కట్టడాలను, శిల్ప సంపదను సెల్ ఫోన్‌లో ప్రత్యక్షంగా తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలలో తెలుసుకోవచ్చు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రామప్ప, లక్నవరం, భద్రకాళి, వేయిస్తంభాల దేవాలయం తదితర పర్యాటక ప్రాంతాలతో పాటు ఖిలా వరంగల్‌లోని సందర్శన ప్రాంతాల వివరాలు గూగుల్ మ్యాప్ ద్వారా లోకేషన్‌కు వెళ్లే మార్గం, ఎంత దూరంలో ఉందో తెలిపే వివరాలను తెలసుకునేలా గూగుల్ మ్యాప్ సెల్‌ఫోన్‌లో పర్యాటకులకు తెలుపుతుంది. దేశ, విదేశాలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే పర్యాటకులు ఇబ్బంది పడకుండా కేంద్ర పురావస్తు శాఖ తీసుకున్న క్యూఆర్ కోడ్‌తో సులభంగా చరిత్రను తెలుసుకోవడంతో పాటు జిల్లాలోని చారిత్రక ప్రాంతాలను త్వరగా చేరుకోవడానికి మార్గాన్ని చూపించడంతో పర్యాటక ప్రియులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


కోటలో రాతి స్తంభంపై ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్

సందడిగా టెక్నోజియాన్

- పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థులు
- నేటి నుంచి ఈవెంట్లు ప్రారంభం
- నిట్ క్యాంపస్ అందంగా ముస్తాబు
- తలపించనున్న మినీ భారతం

హనుమకొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆధ్వర్యంలో విద్యార్థులే రూపొందించిన సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలకు వేదికైన టెక్నోజియాన్-2024 (సాంకేతికోత్సవం) శుక్రవారం వరంగల్ నిట్ కళాశాలలో ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ వేడుకలో దేశంలోని వివిధ జాతీయ సాంకేతిక కళాశాలల నుంచి వెయ్యి మందికిపైగా విద్యార్థులు పాల్గొంటున్నారు. వివిధ సాంకేతిక అంశాలకు, ప్రయోగాలకు, అధునాతన సాంకేతిక ప్రక్రియలకు సంబంధించిన 50 ఈవెంట్లను ఇందులో నిర్వహించనున్నారు. ఈ ఈవెంట్లలో పాల్గొన్న విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందచేస్తారు.

వరంగల్ నిట్‌లో యేటా టెక్నోజియన్ పేరుతో ఈ సాంకేతిక పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతీ సంవత్సరం టెక్నోజియాన్‌ను నవంబర్ రెండో వారంలో లేదా డిసెంబర్ మొదటి వారంలో నిర్వహిస్తారు. అయితే కిందటేడు టెక్నోజియాన్‌ను కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ యేడు జనవరి 19 నుంచి 21వ తేదీ వరకు 'ఇంజీనియస్' ఇతివృత్తంగా నిర్వహించారు. వరంగల్ నిట్‌లో నిర్వహించే టెక్నోజియాన్‌కు దేశవ్యాప్తంగా మంచి పేరుంది. ఇక్కడ నిర్వహించే ఈ సాంకేతిక వేడుకలో పాల్గొనేందుకు దేశంలోని వివిధ సాంకేతిక కళాశాలల విద్యార్థులు ఎక్కువ ఆసక్తి చూపుతారు. విద్యార్థులు అత్యధిక సంఖ్యలో హాజరయ్యేది కూడా ఇక్కడే. టెక్నోజియాన్‌లో మొత్తం 50 ఈవెంట్లను నిర్వహిస్తున్నారు.


ఈవెంట్‌ను ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు

నేటి ఈవెంట్లు

మొదటి రోజు శనివారం నిర్వహించే ఈవెంట్లలో టక్నో హంట్, డాటా సైన్స్‌సెంటర్, బ్రిడ్జి ఫ్యాబ్రికో, ఫ్రైమ్‌వేర వర్క్‌షాప్ సికాడ, కేటీసీ, ల్యాబ్రింత్ సర్క్యూట్ చేస్, లెట్ థెమ్ కుక్, కెమ్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్, పీఎం సైన్స్ క్విజ్, ఫ్యూచర్ మేనేజర్, డిబగ్గర్స్ డ్యుయేల్, బిల్డ్ ఏపీసీ, ఎల్ఎల్‌డీ, మెకానికల్ కిట్ అసెంబ్లీ, వెహికిల్ డెమోన్‌స్ట్రేషన్, డేర్ టూ ఫీల్ ద పెయిన్, ఫైండ్ ద స్కామ్, డచ్ యాక్షన్, థ్రస్ట్ ఆఫ్, ట్రెజర్ హంట్ క్యాంపస్ ఇన్నోవ్ 8, ఐడీయాతన్, ఫారెన్సిక్ ఇన్వెస్టిగేషన్, మెట్ రష్, మెటాఫోర్ట్ మిస్టరీ మేజ్‌తో పాటు రిసర్చ్ పేపర్ ప్రజంటేషన్, కెమ్ ఈ కేస్ ఉన్నాయి. నిట్ క్యాంపస్‌లోని మ్యాథమెటికల్ సొసైటీ, ఫొటోగ్రఫీ క్లబ్, సివిల్ ఇంజనీరింగ్ అసోసియేషన్, క్విజ్ క్లబ్, ఈఏ అండ్ ఎంహెచ్ఎంఎం, సీఎస్ఈఎస్, కెమిస్ట్రీ సొసైటీ, ఫిజిక్స్ సొసైటీ, ఈసీఈ సొసైటీ, రోబోటిక్ క్లబ్, మెకానికల్ ఇంజనీరింగ్ సొసైటీ, ఈఈఈ సొసైటీ, సైన్స్ అండ్ అస్ట్రానమీ క్లబ్ వాల్యు ఎడ్యుకేషన్‌క్లబ్ తదితర సంస్థల ఆధ్వర్యంలో ఈ ఈవెంట్లు జరుగనున్నాయి.

ముస్తాబు

టెక్నోజియాన్‌ను పురస్కరించుకొని నిట్ క్యాంపస్‌ను అందంగా తీర్చిదిద్దారు. రంగు రంగుల విద్యుద్దీపాలతో అలకరించారు. క్యాంపస్‌లో పలుచోట్ల ఈవెంట్లను ప్రతిబింబించే, స్పాన్సర్ల పేర్లు తెలిపే ఫ్లెక్సీలను కట్టారు. వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు హాజరవుతున్నందువల్ల వారికి ఇష్టమైన ఆహారాన్ని అందించేందుకు క్యాంపస్‌లో ఫుడ్ కోర్టులు కూడా వెలిశాయి. ఈవెంట్లు క్యాంపస్‌లో ఎక్కడెక్కడ నిర్వహిస్తున్నది విద్యార్థులు సులభంగా తెలుసుకునేందుకు అన్నిచోట్ల బోర్డులను ఏర్పాటు చేశారు. టెక్నోజియాన్‌కు హాజరయ్యే విద్యార్థులందరికీ క్యాంపస్‌లోనే వసతి, భోజన ఏర్పాట్లను చేశారు. పెద్దసంఖ్యలో విద్యార్థుల రాకతో క్యాంపస్ సందడిగా మారింది. వివిధ రాష్ట్రాలు, సంస్కృతులకు చెందిన విద్యార్థుల రాకతో నిట్ క్యాంపస్ మినీ భారతాన్ని తలపింప చేయనున్నది.

టెక్నోజియాన్ రెండు రోజులే..

- గతంలో మూడు రోజులు
- ఈసారి సాంస్కృతిక కార్యక్రమాలు లేవు
- పూర్తిగా సాంకేతిక అంశాలపై దృష్టి


టెక్నోజియాన్‌కు హాజరవుతున్న విద్యార్థినులు

హనుమకొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్ క్యాంపస్‌లో నిర్వహించనున్న టెక్నోజియాన్‌ను రెండు రోజులకే పరిమితం చేశారు. గతంలో మూడు రోజుల పాటు ఈ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగేవి. టెక్నోజియాన్‌లో భాగంగా పెద్ద ఎత్తున సాంస్కృతికకార్యక్రమాలు కూడా నిర్వహించేవారు. జాతీయ, అంతర్జాతీయ కళాకారులు వీటిలో పాల్గొని విద్యార్థులకు వినోదాన్ని పంచేవారు. కానీ ఈసారి టెక్నోజియాన్‌ను కేవలం సాంకేతిక ఈవెంట్లకే పరిమితం చేశారు. ఈ రెండు రోజుల్లో వివిధ అంశాలకు సంబంధించి 50 ఈవెంట్లను నిర్వహిస్తున్నారు. ఈసారి కొన్ని కొత్తవాటిని కూడా చేర్చుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ ఈవెంట్లు జరుగుతాయి. సాంకేతిక ఈవెంట్లతో పాటు సాంస్కృతిక ప్రదర్శనలు కూడా నిర్వహించడం వల్ల వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు ఈవెంట్లపై, ప్రధానంగా సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేక పోతున్నారు. వినోదాత్మక కార్యక్రమాల వైపే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. ఒకే ప్రాంగణంలో అటు సాంకేతికతతో ఇటు సాంస్కృతికం ఏకకాలంలో నిర్వహించడం వల్ల కొంత గందరగోళం చోటు చేసుకుంటున్నది. విద్యార్థులు సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలపై, వీటిని ప్రతిబింబించే ఈవెంట్లపై దృష్టిని సారించలేకపోతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని సాంస్కృతిక కార్యక్రమాలను మినహాయించి పూర్తిగా సాంకేతిక ఈవెంట్లనే నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు టెక్నోజియాన్‌ను రెండు రోజులకే కుదించారు.

వరంగల్ నిట్‌లో ప్రతీ సంవత్సరం టెక్నోజియాన్‌తో పాటు స్ప్రింగ్ స్ప్రీ (వసంతోత్సవం) కూడా నిర్వహించేవారు. ఇందులో వివిధ రంగాలకు చెందిన కళాకారులతో పెద్ద ఎత్తున సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. విద్యార్థులు కూడా పాల్గొని తమ ప్రతిభను చాటుతారు. ఎలాగో ఏటా స్ప్రింగ్ స్ప్రీ నిర్వహిస్తున్నందు వల్ల టెక్నోజియాన్‌లో సాంస్కృతిక ప్రదర్శనలకు చోటు కల్పించడం లేదు.


టెక్నోజియాన్‌కు హాజరవుతున్న విద్యార్థినులు

విజ్ఞానం, నెట్‌వర్క్ మార్పిడికి గొప్ప వేదిక

- టెక్నోజియాన్ ప్రతీ ఈవెంట్ ఓ పాఠం
- విద్యార్థులు అన్నిట్లో విధిగా పాల్గొనాలి..
- సీసీఐఆర్-ఐఐసీటీ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌వీ చౌదరి
- వరంగల్ నిట్‌లో ప్రారంభమైన టెక్నోజియాన్-24


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్‌వీ చౌదరి

హనుమకొండ, నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి): విజ్ఞానాన్ని, నెట్‌వర్క్‌ను పరస్పరం మార్పిడీ చేసుకోవడానికి గొప్ప వేదిక టెక్నోజియాన్ అని, విద్యార్థులు ఇందులో పాల్గొని ఇక్కడ నిర్వహించే ప్రతీ ఈవెంట్‌లో తమ ప్రతిభను చాటాలని హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-ఐఐసిటి విశిష్ట శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌వీ చౌదరి పిలుపునిచ్చారు. వరంగల్ నిట్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో శుక్రవారం టెక్నోజియాన్-24కు జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా డాక్టర్ చౌదరి మాట్లాడుతూ.. టెక్నోజియాన్‌లలో వివిధ సాంకేతిక అంశాలపై నిర్వహించే పోటీలు, ప్రదర్శించే ప్రయోగాలు, నూతన సాంకేతిక అవిష్కరణలు ఇందులో పాల్గొనే విద్యార్థుల సృజనాత్మకతను, ప్రతిభాపాఠవాలను మరింత పెంచుతాయనీ, కొత్త విషయాలను నేర్చుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. భవిష్యత్తులో విద్యార్థుల కెరీర్ అవకాశాలను మెరుగుపరుస్తాయని అన్నారు. టెక్నోజియాన్‌ను ప్రతీ విద్యార్థి ఒక లెర్నింగ్ ఎక్సీరియన్స్‌గా తీసుకొని ప్రతీ ఈవెంట్‌లో పాల్గొనాలని అన్నారు. సాంకేతిక కళాశాలల్లో చదివే విద్యార్థులు జ్ఞానసముపార్జన ద్వారా దేశంలోని సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.

కాగా, టెక్నోజియాన్ టెక్నికల్ సొసైటీ వైస్‌ప్రెసిడెంట్ ప్రొఫెసర్ హరిప్రసాద్ టెక్నోజియాన్-24 గురించి వివరించారు. ఈసాంకేతికోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు నిట్‌లోని వివిధ శాఖలు, క్లబ్‌లను ఒకదగ్గర చేర్చడానికి ఎంతో కృషి చేసారన్నారు. పాల్గొనే విద్యార్థులకు టెక్నోజియాన్ ఒక గొప్ప అభ్యాస అనుభవాన్ని ఇస్తుందన్నారు. టెక్నోజియాన్‌లో భాగంగా ఈ ఏడు 50 ఈవెంట్ల కన్నా ఎక్కువ నిర్వహించేందుకు ప్రణాళికను రూపొందించామన్నారు. సాంకేతిక ప్రదర్శనలతో పాటు అతిథి ఉపన్యాసాలు ఉంటాయని చెప్పారు. శనివారం సాయంత్రం రోబోటిక్స్ క్లబ్ నిర్వహించే ఈవెంట్ ప్రత్యేక ఆకర్షణగా ఉండగలదని, ఇందులో వంద మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్య మాట్లాడుతూ.. విద్యార్థులకు సవాల్‌గా ఉన్న సమస్యల పరిష్కారానికి శుక్రవారం రాత్రి నుంచి 48 గంటల పాటు నిర్వహించే హ్యాకథాన్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థి సమన్వయకర్త ఇషాన్, డాక్టర్ బి.శ్రీనివాస్, డాక్టర్ మురళీధర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు ప్రముఖ గణిత అధ్యాపకుడు, మ్యాథ్స్‌కేర్ వ్యవస్థాపకుడు డాక్టర్ గజేంద్ర పురోహిత్, తథాస్తు వ్యవస్థాపకురాలు, మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ తనూ జైన్ విద్యార్థులను ఉద్దేశించి అతిథి ప్రసంగిస్తారు.


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



అదుపులోకి తీసుకున్న పోడుదారులను చూపిస్తున్న అధికారులు

చెట్లను నరికిన ఐదుగురి అరెస్ట్

మంగపేట, నవంబరు, 8 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా అడవిలోని చెట్లను నరికి పోడు చేసుకుంటున్న ఐదుగురిని ఫారెస్టు అధికారులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. మంగపేట ఫారెస్ట్ ఇన్‌చార్జి రెంజర్ ఎం. అశోక్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్లూరు ఫారెస్ట్ సెక్షన్ పరిధిలోని 48వ, కంపార్టుమెంట్‌లో గ్రామ శివారులో రిజర్వు అటవీ ప్రాంతంలో కొందరు అడవిలోని చెట్లను నరుకుతున్నట్లు సమాచారం అందిందన్నారు. ఫారెస్టు సిబ్బంది అక్కడకు వెళ్లి అడవిని నరికి పోడు చేసుకున్న పూరేడుపల్లికి చెందిన మల్కం నర్సింహారావు, కొప్పుల సాంబయ్య, పొలం సమ్మయ్య, ఎట్టి ఆదినారాయణ, ముప్పిడి కృష్ణలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సదరు వ్యక్తుల పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు రెంజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లూరు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎమ్డీ. రషీద్, పూరేడుపల్లి ఎఫ్‌బీవో ఇ. దివ్య, బెస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడిన ముఠా అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ కుమార్

వెంకటాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరుస దొంగతనాలకు పాల్పడిన ముఠాను శుక్రవారం వెంకటాపురం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ బండారి కుమార్ విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం స్థానిక పెట్రోల్‌బంకు సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ముగ్గురు వ్యక్తులు ద్విచక్రవాహనంపై నూగూరు వైపు నుంచి మండల కేంద్రానికి వస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన జూపాక ప్రశాంత్, లంబాడీగూడెం తండాకు చెందిన గార ప్రవీణ్, ఖమ్మం జిల్లా ఖానాపూర్ మండలానికి చెందిన కల్తి రాజుగా గుర్తించారు. వారి వద్దనున్న బంగారు చెవికమ్మలు, ఇంటి తాళాలు పగులగొట్టేందుకు ఉపయోగించిన ఐరన్‌రాడ్, సామ్‌సంగ్ మొబైల్, బంగారు రింగులు, వెండి పట్టీలు, హీరోహోండా స్ప్లెండర్ బైకును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కొప్పుల తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దుబ్బగూడెంలో చోరీ

మహదేవపూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరంలోని దుబ్బగూడెం(మజీద్‌పల్లి)లో దొంగలు బీభత్సం సృష్టించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బగూడెంనకు చెందిన బద్ది లక్ష్మి ఐదు రోజుల క్రితం మంచిర్యాలలో బంధువుల ఇంటికి వెళ్లి గురువారం రాత్రి ఇంటికి వచ్చారు. ఇంటిని



వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

పరిశీలించగా ఇంటి వెనుకలో ఉన్న డోర్ తీసి ఉండడంతో అనుమానం వచ్చి బీరువాలో చూశారు. బీరువా తాళం పగులగొట్టి అందులో ఉన్న 80 తులాల వెండి, అర తులం బంగారం, 22 వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. విషయం పోలీసులకు తెలపడంతో కాళేశ్వర ఎస్సై చక్రపాణి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. భూపాల పల్లి జిల్లా ఫింగర్‌ప్రింట్ బ్యూరో టీమ్ రాజ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం వేలిముద్రలను సేకరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుక్క కాటుకు గురైన మహిళ చికిత్స పొందుతూ శుక్రవారం మృత్యువాత పడింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మంజూర్‌నగర్‌లోనీ బీసీ కాలనీకి చెందిన గరిశాల రజిత (37) 15 రోజుల క్రితం ఇంటి ముందు ఉండగా ఆమెను కుక్క కాలిపై విచక్షణ రహితంగా కరిసి తీవ్రంగా గాయపరిచింది. దీంతో స్థానికంగా చికిత్స తీసుకున్నప్పటికీ గాయం నయం కాలేదు. మెరగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యం కోసం సుమారు రూ. 15 లక్షల ఖర్చు చేసినా పరిస్థితి మెరుగుపడలేదు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రేషన్ షాపుల్లో అధికారుల తనిఖీలు

'ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్'

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆం ధ్రజ్యోతి కథనంతో అధికారులు కదిలారు. జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాలపై దాడులు నిర్వహించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి పత్రికలో ఆగని దందా శీర్షికన ప్రచురితం అయిన కథనంపై సివిల్ సప్లైరెవెన్యూ అధికారులు జిల్లాలోని పలు రేషన్ సాపుల్లో తనిఖీలు నిర్వహించారు. రేషన్ షాపులకు వస్తున్న స్టాక్, లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న డీఎస్ఓ శ్రీనాథ్

స్టాక్‌పై వివరాలను పరిశీలించారు. జిల్లాలోని చాలా షాపుల్లో స్టాక్ వివరాల్లో హెచ్చుతగ్గులు అధికారుల దృష్టికి వచ్చినట్లు సమాచారం.

పీడీఎస్ బియ్యం పట్టివేత

భూపాలపల్లి పట్టణంలోని కాశీంపల్లి లో అక్రమంగా నిలువ ఉంచిన రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయీస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లయీస్ టాస్క్‌ఫోర్స్ ఎస్పీ లక్ష్మారెడ్డి అందిం చిన సమాచారం మేరకు రంగంలోకి దిగిన ఆశాఖ అధికారులు శుక్రవారం ఓ ఇంటిలో అక్రమంగా 88 రేషన్ గన్నీ సంచుల్లో నిలువ ఉంచిన 42క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని డీఎస్‌వో శ్రీనాథ్ పరిశీలించారు. ఈకార్యక్ర మంలో సివిల్ సప్లయీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో కార్తీక పూజలు

మహదేవపూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి త్రివేణి సంగమ గోదావరిలో భక్తులు శుక్రవారం పుణ్యస్నానాలు ఆచరించారు. గోదావరి మాతకు పాలు, పసుపు, కుంకుమ, చీర సారెలతో పూజలు చేశారు. గోదావరి మాతకు అర్పించారు. అనంతరం స్వామివారి సన్నిధానంలో కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు శుక్రవారం కావడంతో లక్షపత్రి పూజలు, కుంకుమార్చనలు, లక్షదీపోత్స వంతో పాటు పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అన్ని వర్గాలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

భూపాలపల్లిటౌన్, నవంబరు 8: అన్ని వర్గాలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలబడుతోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం రేవంత్‌రెడ్డి అహర్నిశలు పనిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆర్ఎస్ఆర్, చల్లూరి మధు, బుర్ర కొంరయ్య, దేవన్, మహేష్‌రెడ్డి, రాజేందర్, శ్రీనివాస్, అనిల్, రవీందర్, కిషన్, కర్ణాకర్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల: కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో సీఎం జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవీ, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య, టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● గణపురం : సీఎం జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్ నాయకులు కుమార్, చోటెమియా, అశోక్, భువనసుందర్, ముత్యాల రాజయ్య, దేవేందర్, శివశంకర్, నారాయణగౌడ్, రాజమౌళి ఉన్నారు.

● మొగుళ్లపల్లి: మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ మం డలశాఖ ఆధ్వర్యంలో సీఎం జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్ర మంలో మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎమ్డీ.రఫి, నాయకులు బండి సుదర్శన్, మండ రవి, నడిగోటి రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.

● రేగొండ: మండల కేంద్రంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు పుల్లూరు బాబూరావు ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ట్రేడ్ కార్పోరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టన్న, రాష్ట్ర నాయకులు ఎస్ఎస్ఆర్ సంపత్‌రావు, నాయకులు మోడెం ఉమేష్‌గౌడ్,



భూపాలపల్లిలో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు, ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ చైర్మన్ ప్రకాష్‌రెడ్డి

పున్నం రవి, నాంసాని రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

● టేకుమట్ల: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు దాసారపు సదానందం, బండి రవీందర్, ఎడ్ల రమేష్, ఉపాధ్యక్షుడు మాదం కోంరయ్య, మండల కోశాధికారి శాస్త్రాల కిరణ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనుమరుగుల సంపత్, జిల్లా నాయకులు ఓరుగంటి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

● గోవిందరావుపేట: రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు మండలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రేగ కళ్యాణి, నాయకులు రామచంద్రపు వెంకటేశ్వర్‌రావు, కొంపెల్లి శ్రీనివాసరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

● కన్నాయిగూడెం: రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు మండల అధ్యక్షుడు ఎండీ అప్సర్ పాషా, మండల ఇంచార్జి జాడి రాంబాబు ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాటి రాజబాబు, అరుణ్, ఎస్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

● ములుగు కలెక్టరేట్: రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకల ఈసందర్భంగా పట్టణంలోని చౌరస్తాలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ కేక్ కట్ చేసి ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె జయపాల్‌రెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు ఎమ్డీ.చాంద్ పాషా, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, నాయకులు అహ్మద్



ములుగు ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్

పాషా, మునిసపల్లి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

● వాజేడు: రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను వాజేడులో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో సీనియర్ నాయకుడు దంతులూరి విశ్వనాథ ప్రసాదబాబు రాజు, నాయకులు దాట్ల వాసు, చెన్నం ఎల్లయ్య, రాంబాబు, షాబీర్ పాషా, నానబాబు తదితరులు పాల్గొన్నారు.

● వెంకటాపూర్: రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు మండలకేంద్రంలోని మైనారిటీ బాలికల కళాశాల ఆవరణలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెన్నోజు సూర్యనారాయణ, నాయకులు మిల్కూరి ఐలయ్య, బానోత్ భాస్కర్, జంగిలి రవి, శ్రీనివాస్, మారం సుమన్‌రెడ్డి, సాంబయ్య, జాకీర్, వీరేష్, రాజిరెడ్డి, రాజన్న,రామాచారి, పాల్గొన్నారు.

● మంగపేట: ముఖ్యమంత్రి జన్మదినాన్ని పురష్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో వేర్వేరుగా వేడుకలను యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యాక్షుడు కుర్సం రమేష్, మండల ప్రధానకార్యదర్శిలు చెట్టుపెల్లి ముకుందం, బాడిశ ఆదినారాయణ, యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ నాయకులు పలువురు ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.

● వెంకటాపురం : మండలకేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో సీఎం జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన్‌రావు,మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, నాయకులు బాలసాని వేణు, పిళ్లారిశెట్టి మురళి, ప్రకాష్, పాయం రమణ, సీతాదేవి, తదితరులు పాల్గొన్నారు.

టీజీవో జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ములుగు కలెక్టరేట్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. జడ్పీ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, నేతలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అధ్యక్షుడిగా జడ్పీ సీఈవో సంపత్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడిగా ములుగు ఎంపీడీవో రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా కొమురయ్య, బి.శ్రీనివాస్, శిరీష, ప్రధాన కార్యదర్శిగా జీవన్ కుమార్, కోశాధికారిగా ప్రకాశ్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా డోలి శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీకాంత్, పబ్లిసిటీ సెక్రటరీగా ఎండీ. రఫిక్, ఆఫీస్ సెక్రటరీగా రహీమ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా మాధవీ శీతల్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ చేత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేయించారు. సంఘం బలోపేతాకి కృషిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వారంతా కలెక్టర్



కలెక్టర్‌ను కలిసి టీజీవో జిల్లా కమిటీ, రాష్ట్ర నాయకులు

టీఎస్.దివాకరను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కె.రాజేష్, ఎం.సంతోష్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించగా ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, నాయకులు ఉపేందర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, రామారావు, మురళీధర్‌రెడ్డి, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రాజేందర్

పనిచేయకుంటే చర్యలు తప్పవు

యూఆర్ఎస్ ఉపాధ్యాయులకు డీఈవో క్లాస్

భూపాలపల్లిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఈవో ముద్దమల్ల రాజేందర్ భూపాలపల్లి పట్టణంలోని అర్బన్ రెసిడెన్సియల్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, సిబ్బందికి హెచ్చరించారు. పాఠశాలలో 70 మంది విద్యార్థులు ఉండగా వారు ఎదుర్కొంటున్న పలు సమస్యల గురించి ఇటీవల డీఈవోకు ఫిర్యాదులు అందాయి. ఈక్రమంలో శుక్రవారం ఆయన ఆకస్మికంగా పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లా డారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయనకు తెలిపారు. దీంతో డీఈవో ఉపాధ్యాయులు, సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో పాఠశాలకు రాకపోవడం, సకాలంలో పాఠాలు పూర్తి చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పనిసక్రమంగా చేయకపోతే మరోసారి విధుల్లో నుంచి తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, త్వరలో ఇక్కడి నుంచి పాఠశాలను మారుస్తామని చెప్పారు. ఆయన వెంట సెక్టోరియల్ అధికారి లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

బుగులోని జాతరకు ఆహ్వానం

రేగొండ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిరుమలగిరి గ్రామ శివారులో ఏటా కార్తీకపౌర్ణమి రోజున నిర్వహించే బుగులోని జాతరకు జిల్లా అధికారులకు బుగులోని జాతర కమిటీ శుక్రవారం ఆహ్వానం పలికారు. డీఎస్పీ సంపత్‌రావు, ఎస్పీ కిరణ్‌ఖరే, సింగరేణి పర్సనల్ మేనేజర్ మారుతి, ట్రాన్స్‌కో డీఈ పాపిరెడ్డిలను కలిసి జాతరకు రావాలని, నిర్వహణకు సహకరించాలని కోరారు. ఆహ్వానించినవారిలో ఈవో శ్రీనివాస్, జాతర చైర్మన్ రొంటాల వెంకటస్వామి, నాయకులు నిమ్మల విజేందర్, గంగుల రమణారెడ్డి, పల్నాటి శ్రీను, కడారి జనార్ధన్‌లు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడిగా భరత్

భూపాలపల్లిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ భూపాలపల్లి పట్టణ అధ్యక్షుడుగా దోర్నాల భరత్‌ను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి అంబాల చంద్రమౌళిమాదిగ శుక్రవార ం ప్రకటించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్‌లో పనిచేస్తూ నిరంతరం సేవలందించాడని అన్నారు. ఈ క్రమంలో పట్టణ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన వారందరికీ భరత్ కృతజ్ఞతలు తెలిపారు.

'బెల్ట్ షాపులను నియంత్రించి గ్రంథాలయాలను ఏర్పాటు చేయండి'

కాటారం, నవంబరు 8:బెల్ట్ షాపులను నియంత్రించి గ్రామాల్లో యువత కోసం గ్రంథాల యాలు ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్ కోరారు. ఈ మేరకు కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్‌కు శుక్రవారం ఆయన వినతిపత్రం అందించారు. సామాన్య ప్రజలు, యువత అలవాట్లను ఆసరాగా చేసుకుని పలువురు బెల్ట్‌షాపుల దందా చేస్తున్నారని ఆరోపించారు. మద్యానికి అడ్డగోలుగా ధరలు వసూలు చేస్తూ ప్రజలను దోచుకుంటున్నారన్నారు. యువతలో సామాజిక స్పృహ, విజ్ఞానాన్ని పెంచేందుకు లైబ్రరీలు తోడ్పడతాయన్నారు. యువత నిర్వీర్యం కాకుండా ఉపాధి అవకాశాలను పెంపొందించి వారిని చెడువ్యసనాలనుంచి కాపాడాలని వినతిపత్రంలో సబ్ కలెక్టర్‌కు పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

మంగపేట, నవంబరు, 8 (ఆంధ్రజ్యోతి): సెర్ప్, డీఆర్డీఏ ఆధ్వర్యంలో మండలంలో శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీపీఎం గోవింద్ చౌహాన్ ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని కమలాపురం, శ్రీ విఘ్నేశ్వర గ్రామాఖ్య సంఘం, నర్సింహసాగార్‌లో శ్రీ లక్ష్మీనర్సింహస్వామి మహిళ గ్రామాఖ్య సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం అమ్ముకోవాలని రైతులకు సూచించారు. దళారులను ఆశ్రయించి రైతులు మోసపోవద్దన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన సన్నరకం వరి ధాన్యానికి క్వింటాకు రూ, 2320లు, దొడ్డు రకం క్వింటాకు రూ, 2300లు, ధరకు కొనుగోలు చేయడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమాలలో ఏపీఎం అప్పారావు, సీసీలు తార, చిక్కుల్ల శ్రీను, రైతు సమన్వయ సమితి మాజీ జిల్లా నాయకుడు పచ్చ శేషగిరిరావు, ఆయా గ్రామాల రైతులు, కొనుగోలు కేంద్రం కమిటి సభ్యులు, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

కాటారం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన రెండో దశను శనివారం నుంచి ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లను ఆదేశించారు. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా కాటారం రైతు వేదిక నుంచి అధికారులు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు. శని, ఆదివారాలు సెలవు రోజులైన సర్వే నిర్వహించాల్సిందేన న్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాబు, తహసీల్దార్ నాగరాజు, ఎంపీవో వీరస్వామి తో పాటు సూపర్వైజర్లు రాజేష్, వెంకన్న, వీణ, శివరాణి, రాంమోహన్, లవకుమార్, శ్రీను ఎన్యుమరేటర్లు తదితరులుఉన్నారు.

హార్వెస్టర్ యజమానులు నిబంధనలు పాటించాలి

వెంకటాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హార్వెస్టర్ యజమానులు వరికోతల సమయంలో నిబంధనలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి తేజోవతి సూచించారు. మండలకేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం హార్వెస్టర్ యజమానులు, డ్రైవర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిచేను పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాతనే కోయడం ద్వారా తాలు లేకుండా ఉంటుందని, కోతమిషన్ ఉపయోగించే సమయంలో బ్లోయర్ ఆన్‌లో ఉంచాలని అన్నారు. కోతమిషన్ ఆర్‌పీఎం 19-20 ఉండాలని, గేర్‌స్లాట్ ఏ2 నుంచి బీ1లోపెట్టి కోత కొనసాగించాలన్నారు. ఈసదస్సులో తహసీల్దార్ సదానందం, ఏవో మాదూరి శైలజ, ఏఈవోలు సాయికుమార్, శ్రీనివాస్, సునీల్, స్వామి, హార్వెస్టర్ యజమానులు రవి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

వెంకటాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడల్లో మండలంలోని రామాంజాపూర్ ఆశ్రమ హైస్కూల్ విద్యార్థినులు కె.శ్రావణి, ఎం.సాహితిలు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య తెలిపారు. ఈమేరకు శుక్రవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన విద్యార్థినులను అభినందించారు. జాతీయస్థాయిలో కూడా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోదాదేవి, ధరమ్‌సింగ్, దశరథ్, తిరుమల్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

టీఎస్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గట్టయ్య

కాకతీయఖని, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టయ్య శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ తమ మ్యానిఫెస్టోలో చేర్చిన వాటిని అమలు చేసేందుకు కృషి చేయకుండా ఆ సంఘం నాయకులు స్వప్రయోజనాలు చూసుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యంతో కుమ్మక్కై కార్మికుల హక్కులను తాకట్టు పెడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నో యేండ్లుగా పరిష్కారం కాకుండా ఉన్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా కార్యచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు.

పెళ్లి బస్సులపై అద్దె తగ్గింపు

వెంకటాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ బస్సులను అద్దెకు తీసుకునేవారికి అద్దె రుసుము భారీగా తగ్గించిందని ఆర్టీసీ వరంగల్-2 డిపో మేనేజర్ జ్యోత్స్న శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివాహాలు, తీర్థయాత్రలు, దైవదర్శనాలకు ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకునే వారికోసం సంస్థ 15నుంచి 20శాతం వరకు అద్దెను తగ్గించిందని తెలిపారు. ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకునేవారు 8500372694, 9059662555, 9849118696, 9959558556 నెంబర్లను సంప్రదించాలని ఆమె తెలిపారు.

'అసత్యపు ఆరోపణలు ఖండిస్తున్నాం'

భూపాలపల్లిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులు ఉనికి కోసమే అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్‌దేవన్, కౌన్సిలర్లు ముంజాల రవీందర్, దాట్ల శ్రీనివాస్, జిల్లా నాయకుడు అంబాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలనుతీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలోని అన్ని సమస్యలకు ప్రాధాన్యం ఇచ్చి వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు తమ ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని అన్నారు. గతంలో పనులకు రూ.60కోట్లు ఖర్చు చేసినట్లుగా చెబుతున్నప్పటికీ వాటిలో పారదర్శకత లేదన్నారు. పైగా నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. పాత పనులకు శిలాఫలకాలు అంటూ ప్రజల్లో బీఆర్ఎస్ నాయకులు అపోహలు కల్పిస్తున్నారని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, నాయకులు క్యాతరాజు సాంబమూర్తి, శిరుప అనిల్, కురిమిళ్ల శ్రీనివాస్‌పాల్గొన్నారు.